సాక్షి పెద్దపల్లి

ఆదివారం । 8 । జనవరి । 2023



పడకేసిన గోదావరి పర్యాటకం

గోదావరి పర్యాటకం పడకేసింది. మరో నెల రోజుల్లో ఏసీ బోట్ ప్రారంభిద్దాం అనే సమయంలోనే భారీ వర్షాలకు పడవ కొట్టుకుపోయి తుమ్మల్లో దిక్కుకుంది. 10లో▸



కొండగట్టులో రద్దీ

కొండగట్టు: కొండగట్టులో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. 25వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
28.0 /11.0

వాతావరణం పొడిగా ఉంటుంది.
చలితీవ్రంగా పెరుగుతుంది.
ఈదురుగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

రైతులు శాస్త్రవేత్తల సూచనలు తీసుకోవాలి



మాట్లాడుతున్న పుట్ట మధు

ముత్తారం: రైతులు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల సలహాలు తీసుకుని దిగుబడి సాధించాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మండలంలోని సీతంపేటలో కేవీకే ఆధ్వర్యంలో రైతులకు మిర్చి పంటలపై అవగాహన కల్పించారు. మిర్చిపంటలను శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు. నల్ల తామర పురుగు నివారణపై వివరించారు. డీఏవో ఆదిరెడ్డి మాట్లాడుతూ రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకం అందిస్తోందని పేర్కొన్నారు. మంథని ఏడీఏ మురళి, ఏవో చిందం శ్రీకాంత్ ఉన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ లారీల్లో స్థానికులకే అవకాశం ఇవ్వాలి

రామగిరి: సింగరేణి బొగ్గు ట్రాన్స్‌పోర్ట్ లారీల్లో స్థానికులకే అవకాశం కల్పించాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు జీఎంలను కోరారు. శనివారం ఆర్జీ–1 జీఎంలు, అధికారులు, మంథని ఆర్డీవోతో సమావేశమయ్యారు. భూసేకరణ సమయంలో యాజమాన్యం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని గుర్తుచేశారు. సానుకూలంగా స్పందించిన అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. మంథని ఆర్డీవో వీరబ్రహ్మచారి, తహసీల్దార్ రాంమోహన్, జీఎంలు వెంకటేశ్వరరావు, మనోహర్ ఉన్నారు.

ఆది వరాహస్వామిని దర్శించుకున్న యూపీ స్వామి



స్వామివారి సన్నిధిలో వామనస్వామి

కమాన్‌పూర్(మంథని): మండలకేంద్రంలోని శ్రీఆదివరాహస్వామి వారిని ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వామనస్వామి శనివారం దర్శించుకున్నారు. 20 ఏళ్ల క్రితం కొలంబియా నుంచి ఉత్తరప్రదేశ్‌లోని బృందావనం చేరుకున్నానని, శ్రీమన్నారాయణుడి భక్తుడిగా దేశంలోని వైష్ణవ ఆలయాలను సందర్శిస్తున్నానని తెలిపారు. ఇక్కడి ఆదివరాహస్వామి విశిష్టత తెలుసుకుని దర్శించుకున్నానని తెలిపారు.

పనులు వేగవంతం చేయాలి



స్థలాన్ని పరిశీలిస్తున్న కుమార్ దీపక్

ధర్మారం: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మండలంలోని ఎర్రగుంటపల్లి, కొత్తూరులో చేపట్టిన పనులను శనివారం తనిఖీ చేశారు. ఎర్రగుంటపల్లిలోని నర్సరీ, క్రీడా ప్రాంగణానికి ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. కొత్తూరులో మన ఊరు – మన బడి పనులను పరిశీలించారు. ఎంపీడీవో జయశీల, ఎంపీవో రమేశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు పెద్దపల్లికి 'చాడ' రాక

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలో ఆదివారం జరిగే జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి హాజరవుతున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం తెలిపారు. చాడతోపాటు రాష్ట్ర నాయకులు కలవేన శంకర్ వస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు పెన్షనర్ల సమావేశం

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని జెడ్పీ ఉన్నత (బాలుర) పాఠశాలలో ఆదివారం ఆదాయపు పన్ను చెల్లించే పెన్షనర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు జీవన్‌రాజు తెలిపారు. వార్షిక ఫించన్ రూ.5,50,000, అంతకుమించి పొందుతున్న పింఛన్‌దారులు సమావేశానికి రావాలని కోరారు.

నేడు బీఎంఎస్ బహిరంగ సభ

రామగిరి: సెంటినరీకాలనీలోని తెలంగాణ చౌరస్తా వద్ద ఆదివారం బీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సంఘం అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య కోరారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 11వ వేతన ఒప్పందం సాధించడంలో సంఘం జాతీయ నాయకుడు కొత్త కాపు లక్ష్మారెడ్డి కీలక భూమిక పోషించారని తెలిపారు. కల్వచర్ల స్టేజీ వద్ద లక్ష్మారెడ్డికి స్వాగతం పలికి బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు వివరించారు.

Sunday Special

వాయుపుత్ర.. వాహన మిత్ర..!



కొండగట్టు ఆంజనేయస్వామి



గట్టుదుద్దెనపల్లి ఆలయంలో ట్రాక్టర్‌కు పూజలు

- వజ్రకాయుడి చెంత వాహన పూజలు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కొండగట్టు, గట్టుదుద్దెనపల్లి, అగ్రహారం ప్రసిద్ధి
- ఈ మూడూ ఆంజనేయుడి కోవెలలే..
- దళితబంధు వాహనాలతో ఆలయాల్లో నిత్యం రద్దీ
- వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాక

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఆంజనేయుడు అండేనే అభయం. వజ్రకాయుడి పేరు పలికితే తెలియని మనోబలం. ధైర్యానికి, స్థైర్యానికి, విశ్వాసానికి మారుపేరు హనుమంతుడు. ఉమ్మడి జిల్లాలో కొండగట్టుపై వెలసిన పవనసుతుడి గొప్పతనం తెలియనివారుండరు. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఉమ్మడి జిల్లావాసులకు దాదాపు కులదైవం. కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి నుంచి ప్రతీ ఇంట ఆంజనేయుడి పేరును ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పెట్టుకుంటారంటే అతిశయోక్తి కాదు. ఏ వాహనం కొన్నా మారుతి పాదాల చెంత తొలిపూజ చేసిన తరువాతే రంగంలోకి దింపుతారు. ఉమ్మడి జిల్లాలోని కొండగట్టు ఆ తరువాత మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి, వేములవాడ మండలం అగ్రహారంలోని అంజన్న ఆలయాలు వాహనపూజలకు ప్రసిద్ధి చెందినవి. ఆయా ఆలయాల విశిష్టతపై సండే స్పెషల్..

చిన్న కొండగట్టు గట్టుదుద్దెనపల్లి

చిన్నకొండగట్టుగా పేరొందిన మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి ఆంజనేయస్వామి ఆలయం కూడా రోజురోజుకి ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతోంది. గట్టుదుద్దెనపల్లిలో ఆంజనేయుడి ప్రాచీన విగ్రహాన్ని పెద్ద బండరాయిపై చెక్కారు. అది కాలావధులపై సమాచారం లేదు. 1982 నుంచి గ్రామస్తులు ఆలయాన్ని అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నారు. ప్రస్తుతం సగటున రోజుకు 200కుపైగా వాహనాలు ఇక్కడ పూజలు అందుకుంటాయి. దళితబంధులో మంజూరైన 1,285 వాహనాలకు ఇక్కడే పూజలు చేయించారు.



కొండగట్టులో వాహన పూజలు

700 ఏళ్ల చరిత్ర..

కొండగట్టు దేశంలోని అత్యంత ప్రాచీన ఆలయాల్లో ఒకటి. ఇక్కడి స్వామివారిని దాదాపుగా 700 ఏళ్లగా కొలుస్తున్నట్లు ఆధారాలు ఉన్నాయి. కొండగట్టు మీద వాహన పూజల సంప్రదాయం అనాదిగా వస్తోంది. ఒకప్పుడు రాజులు, సంస్థానాధీశులు, జమీందారుల రథాలు, రైతుల ఎండ్లబండ్లకు పూజలు జరిగేవి. ప్రస్తుతం కొండగట్టుకుపై నెలకు 5000 కుపైగా వాహనాలు పూజకు వస్తాయి. సగటున రోజుకు 170 వాహనాలు ఇక్కడ పూజలందుకుంటాయి. మన రాష్ట్రమే కాదు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు తమ కొత్త వాహనాలకు పూజలు చేయిస్తుంటారు.

అగ్రహారంలో..

వేములవాడ మండలంలోని అగ్రహారం శ్రీ జోడాంజనేయస్వామి ఆలయంలోనూ వాహనపూజలు చేస్తుంటారు. మంగళవారం, శనివారం నాడు ఎక్కువ సంఖ్యలో వాహనపూజలు నిర్వహిస్తారు. మిగితా రోజుల్లోనూ పదులసంఖ్యలో వస్తుంటాయి.

దసరాకు రద్దీగా..

ఈ మూడు ఆలయాల్లోనూ దసరా రోజు పూజ చేయించేందుకు వేలాది వాహనాలు వరుస కడతాయి. దసరారోజు ఈ ఆలయాల వద్ద పూజలు చేయిస్తే.. మంచి జరుగుతుందన్న విశ్వాసంతో ఆ రోజున పాత వాహనాలకు సైతం ఇక్కడ పూజలు చేయడం గమనార్హం. ముఖ్యంగా ట్రాన్స్‌పోర్టు, సివిల్ పనులు చేసే కాంట్రాక్టర్లు తమ వాహనాలను కొండగట్టుకు తీసుకువస్తుంటారు.

దళితబంధుతో తాకిడి

హుజూరాబాద్ నియోజకవర్గంలో దళితబంధు పథకం ద్వారా 8,851 మంది లబ్ధిదారులకు వాహనాలు అందజేశారు. ఇందులో జేసీబీలు, ట్రాక్టర్లు, ట్రక్కులు, లారీలు, ఆటోలు, ట్రాలీలు ఉన్నాయి. వాహనమేదైనా బాహుబలి వద్ద పూజ చేయించకుండా బయటికి తీసేదే ఉండదంటే అతిశయోక్తి కాదు. దళితబంధులో ఇచ్చిన వాహనాల్లో హుజూరాబాద్ మాత్రమే కాకుండా.. ఉమ్మడి జిల్లా, పొరుగున ఉన్న ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి కూడా కొండగట్టు, గట్టుదుద్దెనపల్లి, అగ్రహారానికి తీసుకొచ్చి పూజలు నిర్వహిస్తున్నారు.



పవన్ వారాహి

కేసీఆర్, పవన్ నోట కొండగట్టు

గతేడాది డిసెంబరు 7వ తేదీన జగిత్యాలలో జరిగిన సభలో సీఎం కేసీఆర్ కొండగట్టు ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లు ప్రకటించి తన భక్తిని చాటుకున్నారు. అదే నెలలో జనసేన పార్టీ అధినేత పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ ఎన్నికల రథం వారాహికి జనవరి నెలాఖరున పూజలు చేస్తానని ప్రకటించడంతో మరోసారి కొండగట్టు పేరు మీడియాలో పతాక శీర్షికలకు ఎక్కింది. ప్రతీవారం మంత్రులు, ప్రముఖులు, ఎమ్మెల్యేలు, సాధారణ భక్తుల తాకిడితో పుణ్యక్షేత్రం కిటకిటలాడుతోంది.

తొమ్మిదో విడత హరితహారానికి ఏర్పాట్లు



నర్సరీల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీలు

- నర్సరీల్లో ఊపందుకున్న పనులు
- జిల్లాలో 39.59లక్షల మొక్కల పెంపకం టార్గెట్

పెద్దపల్లిరూరల్: తొమ్మిదో విడత హరితహారానికి అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. జిల్లాలోని 267 పంచాయతీల్లోని నర్సరీల్లో 39,59,584 మొక్కల పెంపకం లక్ష్యంగా నిర్ణయించారు. నర్సరీల్లో ఇదివరకే ఉన్న మొక్కల్లో పెద్దవాటిని వేరుచేయగా.. కవర్లలో మట్టి నింపే పనుల్లో కూలీలు ఉన్నారు.

నీడ, పండ్లనిచ్చే మొక్కలు

నర్సరీల్లో నీడ ఇచ్చే, పండ్లు, పూలనిచ్చే మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకున్నారు. రావి, బాదం, జామ, చింత, నిమ్మ, సీతాఫలం, ఖర్జూరలాంటి పండ్ల మొక్కలతోపాటు మందార, మల్లె, గులాబీ, సన్నజాజి లాంటి పూలమొక్కలు, టేకు, ఈత, ఇప్ప, మద్ది, వెలగ, మర్రి, వేపవంటి మొక్కలను పెంచుతున్నారు. గ్రామ నర్సరీల్లో స్థానికంగానే విత్తనాలను సేకరించడం, అంటుగట్టి మొక్కల పెంపకం చేపడుతున్నారు. ఇంటింటికో తులసి మొక్కను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రతి నర్సరీలో 10వేల మొక్కలు

జిల్లాలో 267 పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీలో 10వేల మొక్కల పెంపకం లక్ష్యంగా ఎంచుకున్నారు. పంచాయతీలలో 2,67,400 మొక్కలు పెంచుతున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. ఇందుకోసం అవసరమైన విత్తన సంచులను తెప్పించి మట్టి నింపే పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే నర్సరీల్లో మిగిలి పెద్దగా పెరిగిన 3,34,400 మొక్కలను సేకరించి ప్రధాన రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో చనిపోయిన మొక్కల స్థానంలో నాటించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

పనులు పర్యవేక్షిస్తున్నాం

నర్సరీల్లో మొక్కల పెంపకం కోసం మట్టి నింపే పనులు సాగుతున్నాయి. ప్రతి నర్సరీలో 10వేల మొక్కలు పెంచుతున్నాం. ఇదివరకే నాటిన మొక్కలను సంరక్షించడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. అయినా అక్కడక్కడ ఎండిన మొక్కలను గుర్తించి వాటి స్థానంలో పెద్దసైజు మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీధర్, డీఆర్‌డీఓ

ఆస్పత్రుల్లో వైద్యుల కొరత

- కాంట్రాక్ట్ వైద్యులకు రెగ్యులర్ ఉద్యోగాలు
- మంథని పెద్దాసుపత్రిలో 13కు ముగ్గురే డాక్టర్లు
- మాతా శిశులో ఒక్కరే గైనకాలజిస్ట్
- పోస్టుల భర్తీలో అధికారుల నిర్లక్ష్యం



మాతా శిశు ఆస్పత్రిలో బాలింతలు, పిల్లలు

మంథని: జిల్లాలో మారుమూల ప్రాంతమైన మంథనిపై ప్రభుత్వం, అధికారుల చిన్నచూపు కొనసాగుతోంది. నియోజకవర్గ కేంద్రంలో వైద్యం అందని ద్రాక్షగా మారినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గతేడాది జూన్‌లో ప్రారంభమైన మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఇప్పటివరకు పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది నియామకం కాలేదు. సౌకర్యాలు సైతం అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇక్కడ అత్యవసర వైద్యం లభించని పరిస్థితి. నాలుగు మండలాలకు పెద్దదిక్కుగా ఉన్న మంథని సామాజిక వైద్యశాల పేరుకు మాత్రమే పెద్దాసుపత్రి కాగా సేవలు మాత్రం అంతంతే.

ఖాళీగా పోస్టులు

మంథని సామాజిక వైద్యశాలలో పనిచేసిన ఆరుగురు కాంట్రాక్ట్ వైద్యులకు రెగ్యులర్ ఉద్యోగాలు రావడంతో ఇక్కడ పోస్టులు ఖాళీ అయ్యాయి. నూతనంగా కేటాయించిన రెగ్యులర్ పోస్టింగుల్లో ఆసిఫాబాద్ నుంచి కేవలం ఒక్క రెగ్యులర్ వైద్యురాలికి మాత్రమే పోస్టింగ్ ఇచ్చారు. గోదావరిఖని నుంచి ఒక్కరిని డెప్యూటేషన్‌పై పని చేయిస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ డెంటల్ డాక్టర్ రెగ్యులర్ కాగా, కాంట్రాక్ట్ పద్ధతిన ముగ్గురు పనిచేస్తున్నారు. కేవలం ఒక్క పిల్లల వైద్యుడు మినహా అసిస్టెంట్ సివిల్ సర్జన్లు, ప్రత్యేక వైద్య నిపుణుల పోస్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి. ఆస్పత్రిలో 13 మంది వైద్యులు విధుల్లో ఉండాల్సి ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే పనిచేస్తున్నారు.

ఉన్నవారిపై భారం

మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు స్త్రీ వైద్య నిపుణులు, డ్యూటీ మెడికల్ ఆఫీసర్, పిల్లల వైద్యులతో పాటు ముగ్గురు అనస్థీషియా వైద్యులు ఉండాలి. కానీ ప్రస్తుతం కేవలం ఒకే ఒక్క గైనకాలజిస్టు పని చేస్తున్నారు. ఇక్కడి మత్తు వైద్యులను వేరే ఆస్పత్రులకు డెప్యూటేషన్‌పై పంపించి ఆయా ఆస్పత్రుల నుంచి ఇక్కడికి డెప్యూటేషన్ వేశారు. సామాజిక వైద్యశాల నుంచి పిల్లల వైద్యుడి సేవలను వినియోగిస్తున్నారు. థియేటర్ అసిస్టెంట్, మిడ్ వైఫరీ, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టు, టెక్నికల్ సిబ్బంది పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఆస్పత్రి ప్రారంభమై ఆరుమాసాలు దాటినా వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్న వైద్యుల పైనే భారం పడుతోంది.

లోపించిన పారిశుధ్యం

మాతా శిశు, సామాజిక వైద్యశాలలో పారిశుధ్య నిర్వాహణ సక్రమంగా లేదని విమర్శలున్నాయి. వరదలతో మాతా శిశు ఆస్పత్రి సగానికి పైగా మునిగింది. ఆస్పత్రి చుట్టూ ఇంకా మురుగు అలాగే ఉంది. అంతేగాకుండా ఆస్పత్రిలో సైతం పారిశుధ్య నిర్వాహణ సక్రమంగా లేదు. మంథని సామాజిక వైద్యశాలలోనూ అదే పరిస్థితి నెలకొంది. పాలకులు, ప్రభుత్వం స్పందించి ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

వైద్యుల నియామకానికి నోటిఫికేషన్

మంథని సామాజిక వైద్యశాలలో ఖాళీగా ఉన్న వైద్యుల నియామకానికి జిల్లా అధికారులు నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఇక్కడ కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేసిన వైద్యులు రెగ్యులర్ జాబ్‌కు వెళ్లిపోయారు. మాతా శిశు ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది నియామకానికి సంబంధించి జిల్లా, వైద్య ఆరోగ్య శాఖ అధికారి పర్యవేక్షణ చేస్తున్నారు.

– కంది శ్రీనివాస్‌రెడ్డి, మంథని సామాజిక వైద్యశాల ఇన్‌చార్జి

శాంతిభద్రతల అదుపుతోనే అభివృద్ధి



సీపీని సన్మానిస్తున్న పోలీసు అధికారులు

గోదావరిఖని: శాంతిభద్రతలు అదుపులో ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమని సీపీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మల్టీజోన్–1 ఐజీగా పదోన్నతిపై వెళ్తున్న ఆయనకు ఆర్ఆర్ గార్డెన్‌లో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలతోనే స్థానికులకు ఉద్యోగ, ఉపాధి లభిస్తుందన్నారు. కమిషనరేట్ పరిధిలోని సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్‌లో లాఅండ్ఆర్డర్ సమస్యలు లేకుండా చూశామన్నారు. 16 నెలలపాటు పనిచేయడం సంతోషాన్నిచ్చిందన్నారు. పీపుల్స్ ఫ్రెండ్లీ పేరుతో ప్రజలకు దగ్గరమయ్యామని పేర్కొన్నారు. మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల ప్రజలు, అధికారులు, మీడియా మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీస్ అధికారులు ఉన్నారు.

బీజేపీకి పెరుగుతున్న ఆదరణ



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

పెద్దపల్లిరూరల్: ప్రధాని నరేంద్ర మోదీ నీతివంతమైన పాలనకు ప్రజలంతా అండగా నిలిచారని, ఇందుకు మోదీ, బీజేపీకి పెరుగుతున్న ఆదరణే నిదర్శనమని పార్టీ నియోజకవర్గ పాలక్ వన్నాల శ్రీరాములు అన్నారు. పెద్దపల్లి శివారు రంగంపల్లిలో శనివారం బూత్‌స్థాయి నాయకులతో పార్టీ ఏర్పాటు చేసిన వర్చువల్ సమావేశం అనంతరం మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, బూత్‌స్థాయి నాయకుల కృషి ఫలితంగానే సాధ్యపడుతుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ సర్కార్ పెంచిన పన్నులు, చార్జీల భారాన్ని ప్రజలు మోయలేకపోతున్నారని తెలిపారు. పింఛన్లు రద్దు చేస్తారనేది బీఆర్ఎస్ అసత్యప్రచారమేనని, అధికారంలోకొస్తే ఇంకా పెంచుతామని వెల్లడించారు. నియోజకవర్గ కన్వీనర్ పిన్నింటి రాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాయకులు అర్జున్‌రావు, గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి, పునుకొండ శ్రీధర్, జనార్దన్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, కొంతం శ్రీనివాసరెడ్డి, కేశవరావు, వర్ల సమ్మయ్య, శ్రీనివాసరావు, నర్సింగం, ఫహీం, ఫయాజ్, క్రాంతి, రాజు, సతీశ్, వేణు తదితరులున్నారు.

డాడ్జ్‌బాల్ క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న లక్ష్మీనారాయణ

పెద్దపల్లిరూరల్: డాడ్జ్‌బాల్‌లో జిల్లాకేంద్రానికి చెందిన క్రీడాకారులు జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చి కీర్తిప్రతిష్ఠలు తెచ్చారని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. కర్ణాటక రాష్ట్రంలో జరిగిన జాతీయ సబ్ జూనియర్ డాడ్జ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిన గాయత్రీ విద్యానికేతన్ టెక్నో స్కూల్ విద్యార్థులు వరూధి, శ్రావ్య, అక్షర, సాత్విక్, వెంకటమాధవ్‌ను లక్ష్మీనారాయణ కలెక్టరేట్‌లో అభినందించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్, స్రవంతి, కరస్పాండెంట్ రజనీ, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దిన్ పాల్గొన్నారు.



అలరించిన బొమ్మల కొలువు



గోదావరిఖని: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్జీ–2 ఏరియా ఎస్‌సీఓఏ క్లబ్‌లో బొమ్మల కొలువు ఘనంగా నిర్వహించారు. బొమ్మలను అందంగా అలంకరించారు. అనంతరం చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో లేడీస్‌క్లబ్ అధ్యక్షురాలు సవిత, ఆర్జీ–1, 3 అధ్యక్షులు పద్మ, శ్రీదేవి, కళ్యాణి, మాలతి తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన గోదావరి పర్యాటకం



గోదావరినదిలో రెగెట్టా పోటీలు (ఫైల్)



తుమ్మపొదల్లో ఉన్న ఏసీ బోట్

- తుమ్మ పొదల్లోనే ఏసీ బోట్
- ప్రతిపాదనలకే పరిమితమైన హరిత హోటల్

గోదావరిఖని(రామగుండం): గోదావరి పర్యాటకం పడకేసింది. మరో నెలరోజుల్లో ఏసీ బోట్ ప్రారంభిద్దాం అనే సమయంలోనే భారీ వర్షాలకు పడవ కొట్టుకుపోయి తుమ్మల్లో చిక్కుకుంది. రెండేళ్లు దాటినా పర్యాటకానికి మోక్షం లేకుండా పోయింది. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గోదావరి తీరంలో పర్యాటకం కావాలని అధికారులను కలిసి కోరడంతో దానికి మంజూరు చేయించారు. కానీ అనుకున్న లక్ష్యం మాత్రం నెరవేరలేదు. గత నెల సింగరేణి పర్యాటకం ప్రారంభమైంది కానీ గోదావరి పర్యాటకం కలగానే మిగిలింది.

కాళేశ్వరం ఏర్పాటుతో..

కాళేశ్వరం ప్రాజెక్టు ఏర్పాటుతో ఏడాది పొడవునా గోదావరినది నీటితో కళకళలాడుతోంది. నది తీరం మరో కోనసీమగా మారుతోందని ఈప్రాంత ప్రజలు ఆశపడ్డారు. తీరంలో సమ్మక్క– సారలమ్మ గద్దెలు, స్నానాలకు వీలుగా పుష్కరఘాట్, పర్యాటకులకు ఆసక్తి గొలిపే రెగెట్టా పోటీలు, రెండు బ్రిడ్జిలపై నిల్చుని పోటీలను వీక్షించేందుకు పర్యాటకులకు అనుకూలంగా ఉన్నాయి. గోదావరి అందాలను వీక్షించేందుకు వీకెండ్‌లో పడవ ప్రయాణం కోసం రూ.80లక్షలతో పర్యాటక శాఖ నుంచి డబుల్‌డెక్కర్ ఏసీ బోట్ కొనుగోలు చేశారు. అంతా సిద్ధమై ప్రారంభమవుతుందనే క్రమంలో భారీ వర్షాలతో పడవ కొట్టుకుపోయి తుమ్మపొదల్లోకి చేరింది. దానికి మరమ్మతు చేసి నదిలోకి తీసుకువచ్చేందుకు జాప్యం జరుగుతోంది.

కలిసిరాని పర్యాటకుల బోట్

రెండేళ్ల క్రితం సమ్మక్క– సారలమ్మ జాతర సమీపంలో గోదావరినదిలో ఏసీ బోట్ ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. పూణే నుంచి వచ్చిన నిపుణులు డబుల్‌డెక్కర్ ఏసీ బోట్‌కు ఇన్‌స్టాలేషన్ చేశారు. అంతా పూర్తయి ఇక నదిలోకి ప్రవేశించే సమయంలో ఏసీకి సంబంధించిన కాపర్‌వైర్లను దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో రెండు నెలలు జాప్యం జరిగింది. తర్వాత బాలారిష్టాలు సవరించుకుని తిరిగి నదిలోకి ప్రవేశపెట్టేందుకు సిద్ధమయ్యే క్రమంలో భారీ వర్షాలు పడ్డాయి.

పర్యాటకానికి అనుకూలంగా నది తీరం

జిల్లాలోనే అతిపెద్ద పట్టణంగా ఉన్న గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి సమీపంలో ఉన్న నది తీరం పర్యాటక క్షేత్రంగా విరాజిల్లేందుకు అన్ని వసతులున్నాయి. సింగరేణి బొగ్గు గనులు, ఎన్టీపీసీ పవర్‌ప్లాంట్, ఆర్ఎఫ్‌సీఎల్‌తో పాటు గోదావరి బ్రిడ్జికి కొద్ది దూరంలో సుందిళ్లబ్యారేజీ సందర్శన స్థలం ఉంది. తీరం వెంట ఇరువైపులా వంద ఫీట్ల రహదారి ఏర్పాటు చేసి పచ్చని చెట్లు, పచ్చిక బయళ్లతో మరో కోనసీమగా మార్చే అవకాశాలు బోలెడు ఉన్నాయి. కానీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా పర్యాటకానికి జాప్యం జరుగుతోంది. ఈప్రాంతానికి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తారనే ఆలోచనతో గోదావరిఖని కవిత థియేటర్ సమీపంలో హరిత హోటల్ ఏర్పాటుకు అధికారులు స్థలాన్ని పరిశీలించి వెళ్లారు. హోటల్ నిర్మాణం ప్రతిపాదనల దశలోనే ఉంది.

నిలిచిన రెగెట్టా పోటీలు

గోదావరిపై సుందిళ్ల బ్యారేజీ ఏర్పాటుతో నది ఏడాది పొడవునా నీటితో నిండుకుండలా మారింది. ఏటా హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌లో నిర్వహిస్తున్న మాదిరిగా ఇక్కడ రెగట్టా పోటీలు ఒక్కసారి విజయవంతంగా నిర్వహించారు. పోటీల తువిషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి ఎమ్మెల్యే చందర్ తీసుకెళ్లడంతో గోదావరితీరాన్ని మరింత పర్యాటకంగా అభివృద్ధి చేయాలని సూచించారు. దీంతో రెండు బోట్లు, ఫ్లోటింగ్ ప్లాంట్ ఫాం, రూ.80లక్షలతో పెద్ద పడవ తెప్పించారు.

సింగరేణి పర్యాటకంతో పెరగనున్న సందడి



ఇటీవల సింగరేణిగని దర్శించడానికి వచ్చిన పర్యాటకులు

ఆర్టీసీ చేపట్టిన సింగరేణి సందర్శన్‌తో పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. ఇటీవల భారీగా పర్యాటకులు ఆర్టీసీ ప్యాకేజీ ద్వారా వచ్చారు. ప్రతివారం ఒకటిలేదా రెండు బస్సుల్లో హైదరాబాద్ నుంచి వస్తున్నారు. ఈక్రమంలో గోదావరినదిపై బోట్ టూరిజం ప్యాకేజీ ఏర్పాటు చేస్తే మరింత సందడి పెరగనుంది.

త్వరలో మరమ్మతు చేస్తాం

భారీ వర్షాలకు కొట్టుకుపోయి తుమ్మల్లో చేరిన బోట్‌ను బయటకు తీసుకవచ్చేందుకు నిర్ణయం తీసుకున్నాం. బోట్ తయారు చేసిన కాంట్రాక్టు ద్వారా విడిభాగాలుగా విడదీసి సురక్షిత ప్రాంతానికి తరలిస్తాం. ఇన్‌స్టాలేషన్ చేసిన అనంతరం నదిలోకి ప్రవేశపెట్టాలని యోచిస్తున్నాం. అయితే మళ్లీ వరదలు వచ్చినా బోట్ సురక్షితంగా ఉండేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలిస్తున్నాం. బోట్ సేఫ్టీ కోసం అన్ని చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ప్రత్యేక బృందాన్ని పంపించి స్టడీ చేస్తున్నాం. – మనోహర్‌రావు, రాష్ట్ర టూరిజం ఎండీ

క్లుప్తంగా

రాజన్న సేవలో ఇనుమడుగు పీఠాధిపతి



శ్రీహరిస్వామిజీకి ప్రసాదం అందజేస్తున్న భీమాశంకరశర్మ

వేములవాడ: ఇనుమడుగు పీఠాధిపతి శ్రీశ్రీ శ్రీహరిస్వామిజీ శనివారం వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. ఈసందర్భంగా స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం వారికి ఘనస్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం అద్దాల మంటపంలో వేదమంత్రాలతో ఆశీర్వచనం గావించారు. వారి వెంట పర్యవేక్షకులు అల్లి శంకర్, శ్రీరాములు, ఆలయ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.18లక్షల ఎక్స్‌గ్రేషియా

పాలకుర్తి(రామగుండం): పాలకుర్తి మండలం బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో శుక్రవారం మృతిచెందిన కాంట్రాక్ట్ కార్మికుడు రడం పరుశరాం కుటుంబానికి రూ.18లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించింది. రూ.30లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలని కార్మికసంఘం నాయకులు, కార్మికులు పరుశరాం మృతదేహంతో కంపెనీ గేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. దాదాపు 12గంటల ఆందోళన అనంతరం కార్మికసంఘం నాయకులు, కంపెనీ అధికారులకు మధ్య జరిగిన చర్చల్లో రూ.18లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు దహనసంస్కారాల ఖర్చులకు రూ.25వేలు, కుటుంబంలో ఒకరికి స్కిల్డ్ ఉద్యోగం ఇచ్చేందుకు అంగీకారం కుదరడంతో ఆందోళన విరమించారు. ఈసందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పెద్దపల్లి సీఐ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో బసంత్‌నగర్, పెద్దపల్లి ఎస్సైలు శ్రీనివాస్, రాజేశ్, సహదేవ్‌సింగ్‌తో పాటు పోలీస్‌సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. చర్చల్లో కంపెనీ ప్లాంట్‌హెడ్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఆర్ మేనేజర్ గోవిందరావు, కార్మిక సంఘం అధ్యక్షుడు సూర సమ్మయ్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

జగిత్యాల: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ ప్రవేశాల గడువు పొడిగించినట్లు స్థానిక అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ శ్యామ్ శనివారం తెలిపారు. ఈనెల 9 – 13లోగా ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 98492 66786 మొబైల్‌నంబరులో సంప్రదించండి.

హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే

జ్యోతినగర్(రామగుండం): కోర్టు ధిక్కార కేసులో ఎన్టీపీసీ చైర్‌పర్సన్‌కు రెండు నెలల జైలు శిక్ష విధిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు శుక్రవారం స్టే విధించింది. హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించాలంటూ ఎన్టీపీసీ చీఫ్ తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు పీఎస్ నరసింహ, జేబీ పార్థివాలాతో కూడిన ధర్మాసనం పరిగణనలోకి తీసుకున్నారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాలపై స్టే ఇస్తున్నామని ధర్మాసనం పేర్కొంది. నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల నియామకాలకు సంబంధించిన ధిక్కార కేసులో 2022 డిసెంబర్ 31న ఎన్టీపీసీ చైర్‌పర్సన్‌కు రెండు నెలల జైలుశిక్ష విధించిన సందర్భంలో స్టే విధించినట్లు సమాచారం.

ఇద్దరిపై కేసు

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని కోనాపూర్ గ్రామంలో ఇంటి నిర్మాణ పనుల్లో బోరు, పైప్‌లైను ధ్వంసం చేసిన తండ్రీకొడుకులపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్సై మనోహర్‌రావు కథనం.. కోనాపూర్‌కు చెందిన తుమ్మల నర్సవ్వ అదే గ్రామానికి చెందిన రాజిరెడ్డి నుంచి భూమి కొనుగోలు చేసి ఇంటి నిర్మాణం ప్రారంభించింది. కాగా సదరు భూమి విషయంలో రాజిరెడ్డి అతడి తమ్ముడు రాజేశం మధ్య వివాదం కొనసాగుతుంది. వివాదం కొనసాగుతుండగానే భూమిని ఎలా కొనుగోలు చేశావని నర్సవ్వ ఇంటి నిర్మాణం చేస్తున్న ప్రదేశానికి వెళ్లిన రాజేశం అతడి కుమారుడు లక్ష్మణ్ బోరు, పైప్‌లైన్‌ను ధ్వంసం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రాజేశం, లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని గణేశ్‌నగర్‌లో గల రామేశ్వరాలయంలో వాచ్‌మెన్‌పై దాడి చేసి చోరీకి పాల్పడ్డ నిందితుడిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వన్‌టౌన్ సీఐ నటేశ్ వివరాల ప్రకారం.. గత నెల 25న తెల్లవారుజామున జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలానికి చెందిన రాతు పవన్(20) రామేశ్వరాలయంలోకి ప్రవేశించి వాచ్‌మెన్ గాజుల సత్తయ్యను ఐరన్ రాడ్‌తో గాయపరిచి హుండీలోని డబ్బు ఎత్తుకెళ్లాడు. అతడిపై నిఘా పెట్టిన పోలీసులు శనివారం గీతాభవన్ చౌరస్తాలో అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. పవన్‌పై గతంలో ఒక మర్డర్ కేసు కూడా ఉంది. అతడి నుంచి రూ.2,500, ఐరన్‌రాడ్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పారిపోయిన వ్యాపారిని పట్టుకున్న బాధితులు..?

జగిత్యాలక్రైం: అప్పు పేరిట పలువురి నుంచి రూ.10 కోట్ల నుంచి రూ.22 కోట్ల వరకు వసూలు చేసి కుటుంబంతో సహా పారిపోయిన జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన రేగొండ నరేశ్‌ను బాధితుడొకరు పట్టుకున్నట్లు సమాచారం. అప్పు తీసుకున్న వ్యాపారి 2021 సెప్టెంబర్ చివరి వారంలో పరారైన విషయం తెల్సిందే. పోచమ్మవాడకు చెందిన పిట్టల రజిత 2 అక్టోబర్ 2021న జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్పీ సింధూశర్మ రెండు ప్రత్యేక బృందాలతో బెంగళూరు, హైదరాబాద్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లభించకపోవడంతో బాధితులంతా ఆందోళనకు గురయ్యారు. తాజాగా శనివారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో రేగొండ నరేశ్‌ను సారంగాపూర్ మండలానికి చెందిన బాధితుడు పట్టుకున్నట్లు సమాచారం. పట్టుకున్న వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీనిపై పట్టణ సీఐ కిశోర్‌ను వివరణ కోరగా.. తాము పట్టుకోలేదని, సోషల్ మీడియాలో వచ్చిన ఫొటోలపై ఆరా తీస్తున్నామని వెల్లడించారు.

మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు

రాయికల్(జగిత్యాల): మండలంలోని ఇటిక్యాల మోడల్‌స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న మహ్మద్ జావిద్‌ను ప్రిన్సిపాల్ శ్రీనివాస్ కొట్టడంతో శనివారం విద్యార్థి తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌పై పోలీస్‌స్టేషన్‌లో, ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా విద్యార్థి చదవకపోవడంతో మందలించానని తెలిపారు.

యువతి అదృశ్యం

జగిత్యాలక్రైం: జగిత్యాలరూరల్ మండలం మోరపల్లికి చెందిన 20ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు. యువతి శనివారం ఉదయం చల్‌గల్ గ్రామంలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్తానని చెప్పి వెళ్లింది. కానీ ఆమె ఆచూకీ దొరక్కపోవడంతో యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై తెలిపారు.

విద్యుత్ మోటార్ చోరీ

జగిత్యాలక్రైం: జగిత్యాలరూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన దుంపల రాజిరెడ్డికి చెందిన విద్యుత్ మోటార్‌ను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. పొరండ్లకు చెందిన దుంపల రాజిరెడ్డి తన వ్యవసాయ పొలం వద్ద శనివారం ఉదయం విద్యుత్ మోటార్ పెట్టేందుకు వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో బాధితుడు శనివారం రాత్రి రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కలుషిత నీటితోనే విద్యార్థులకు అస్వస్థత

- రాజన్నసిరిసిల్ల జిల్లా విద్యాధికారి రాధాకిషన్
- పాఠశాలలో నీటి పరిశీలన
- నీటిని ల్యాబ్‌కు పంపిన భగీరథ అధికారులు



పాఠశాలను పరిశీలిస్తున్న రాధాకిషన్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కలుషితమైన నీటితో మధ్యాహ్న భోజనం వండి పెట్టడంతోనే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పేర్కొన్నారు. గొల్లపల్లిలోని పాఠశాల పరిసరాలు, నీటి సరఫరా చేస్తున్న సంపు నుంచి సేకరించిన నీటిని పరీక్షల కోసం ల్యాబ్‌కు తరలించారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ, భగీరథ నీటి సరఫరా రెండు రోజులుగా నిలిచిపోవడంతో ట్యాంకర్ ద్వారా తెచ్చిన నీటిని సంపులో నింపి.. వాటితోనే వంట చేయడం ద్వారా విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు భావిస్తున్నామన్నారు. నీటిని పరీక్షలకు పంపగా, ల్యాబ్ నుంచి నివేదిక రాగానే దాని ఆధారంగా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఘటనపై నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన ఆకుకూరలతో భోజనాన్ని వండి పెట్టాలని సూచించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై దృష్టి సారించే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నారని వివరించారు.

చర్యలు తీసుకోవాలి : ఏబీవీపీ

విద్యార్థులు కలుషిత ఆహారం తినడంతో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో ఉన్నారని, పాఠశాలల్లో మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఈవో రాధాకిషన్‌కు ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కోకన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాశం సరోజన, బాల్‌రెడ్డి, నాయకులు దేవారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి



మడ్డి రాములు (ఫైల్)

జ్యోతినగర్(రామగుండం): అప్పుల బాధతో కౌలు రైతు మడ్డి రాములుగౌడ్(47) ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ మేడిపల్లి గ్రామానికి చెందిన రాములుగౌడ్ కౌలు రైతుగా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కౌలు చేసిన వ్యవసాయంలో నష్టపోవడం, ఆర్థిక ఇబ్బందులు ఏర్పడటంతో మనస్తాపం చెంది గురువారం ఇంట్లో గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి సోదరుడు రాజబాబు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య అంబిక, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామానికి చెందిన యాదగిరి మధురమ్మ (75) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. ఎస్ఐ రాజేశ్ వివరాలు.. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మధురమ్మ జీవితంపై విరక్తి చెంది శుక్రవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు స్థానికంగా ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందింది.

ప్రైవేటు క్లినిక్ సీజ్



సీజ్ చేయిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

రాయికల్(జగిత్యాల): పట్టణంలోని జనతా ప్రైవేటు క్లినిక్‌ను శనివారం సీజ్ చేసినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ తెలిపారు. పట్టణానికి చెందిన చింతల బ్రహ్మంకు ఆర్ఎంపీ అస్లాం వైద్యం చేయగా వికటించింది. న్యాయం చేయాలని బాధితుడు సంబంధిత ఆర్ఎంపీ వద్దకు వెళ్లగా దురుసుగా ప్రవర్తించాడు. దీంతో బాధితుడు బ్రహ్మం ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు క్లినిక్‌ను సీజ్ చేసినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో తెలిపారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్‌చంద్ర, డెమో అధికారి తులసి నారాయణ, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, రాంకుమార్ ఉన్నారు.

చికిత్స పొందుతూ నవజాత శిశువు మృతి

- డాక్టర్ నిర్లక్ష్యమేనంటూ బంధువుల ఆందోళన



ఆసుపత్రి ఎదుట ఆందోళన

కరీంనగర్‌టౌన్: నగరంలోని ఖార్ఖానగడ్డకు చెందిన ఇమ్రాన్– సన దంపతుల నవజాత శిశువు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అయితే డాక్టర్ నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబీకులు, బంధువులు ఆందోళన చేపట్టిన ఘటన శనివారం రాత్రి జరిగింది. వివరాలు.. నాలుగు రోజుల క్రితం జన్మించిన శిశువుకు ఆరోగ్యం బాగా లేక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వెనుకగల ఓ పిల్లల వైద్యుడి వద్దకు శనివారం మధ్యాహ్నం తీసుకువచ్చారు. గంట పాటు చికిత్స అందించిన సదరు పిల్లల వైద్యుడు పరిస్థితి విషమించడంతో చొప్పదండి రోడ్‌లోని మరో ఆసుపత్రికి పంపించాడు. అక్కడ చికిత్స పొందుతూ శిశువు మరణించాడు. అయితే మొదట ట్రీట్‌మెంట్ చేసిన వైద్యుడి నిర్లక్ష్యం వల్లే శిశువు ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడని ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట కుటుంబీకులు, బంధువులు ధర్నా నిర్వహించారు. డాక్టర్‌పై భౌతికదాడికి పాల్పడినట్లు తెలిసింది. ఈ విషయమై సదరు వైద్యుడిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా, అందుబాటులోకి రాలేదు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ముత్తారం(మంథని): మండలంలోని పోతారం గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. గ్రామస్తుల వివరాలు.. జమ్మికుంట మండలం టేకుర్తి గ్రామానికి చెందిన మోతే అంజి ఓసీపీ– 2లో వోల్వో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం డ్యూటీ అనంతరం ఇంటికి వెళుతున్న క్రమంలో పోతారం గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో బ్లూకోల్ట్స్ సిబ్బంది అక్కడకు చేరుకొని బాధితుడిని అంబులెన్స్‌లో పెద్దపల్లి ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

కత్తితో యువకుడి వీరంగం

కథలాపూర్(వేములవాడ): మండలంలోని అంబారిపేట గ్రామంలో శనివారం సాయంత్రం ఓ యువకుడు కత్తితో వీరంగం సృష్టించాడు. గ్రామస్తుల కథనం.. మండలంలోని కలిగోట గ్రామానికి చెందిన యువకుడు శనివారం సాయంత్రం అంబారిపేట ప్రభుత్వ పాఠశాల వద్దకు బైక్‌పై స్పీడ్‌గా వచ్చాడు. ఓ ఉపాధ్యాయురాలు నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌తో ఢీకొట్టేలా స్పీడ్‌గా వెళ్లడంతో అక్కడే ఉన్న తోటి ఉపాధ్యాయులు సదరు యువకుడిని మందలించారు. అనంతరం ఉపాధ్యాయురాలు, విద్యార్థులు వారి స్వగ్రామాలకు వెళ్లేందుకు బస్సు ఎక్కారు. తర్వాత యువకుడు బైక్‌పై ఆర్టీసీ బస్సును వెంబడించాడు. బస్సు ఎక్కి కత్తితో అటూఇటూ తిరుగుతూ హల్‌చల్ చేశాడు. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు, మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. యువకుడి తీరుతో విసిగిపోయిన కొందరు ప్రయాణికులు వారించడంతో బస్సు దిగాడు. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్సై రామచంద్రం అక్కడకు చేరుకొని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. యువకుడికి డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేయగా కల్లు తాగిన మత్తులో ఉన్నట్లు గుర్తించామని పోలీసులు చెప్పారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

రామగుండం: ఇంధన డిపోల సమీపంలో ముందు వెళుతున్న కారును వెనుక నుంచి లారీ ఢీకొనగా కారులో ఉన్నవారు త్రుటిలో ప్రాణపాయం నుంచి బయటపడ్డారు. బాధితుల వివరాలు.. శనివారం రాత్రి కారులో హైదరాబాద్ నుంచి గోదావరిఖని వస్తున్న క్రమంలో ఐటీసీ ఔట్‌లెట్ వద్ద కారు వెనుక వస్తున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన లారీ వేగంగా ఢీకొనగా.. కారు అదే వేగంతో ముందున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు, వెనుక భాగం పూర్తిగా దెబ్బతింది. ఈ ఘటనలో గోదావరిఖనికి చెందిన వైఎస్సార్‌టీపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి జిమ్మిబాబు మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదంపై అంతర్గాం ఎస్సై సంతోష్‌కుమార్‌ను వివరణ కోరగా బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి



వివరాలు తెలుసుకుంటున్న సమియొద్దీన్

కథలాపూర్(వేములవాడ): అసంక్రమిత బీపీ, షుగర్, క్యాన్సర్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ఎండీ సమియొద్దీన్ సూచించారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. బీపీ, షుగర్, క్యాన్సర్‌తో బాధపడుతున్నవారికి వైద్యం అందిస్తున్న తీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 40 ఏళ్ల పైబడిన వారు వైద్యుల సలహా మేరకు రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యసిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజారోగ్యం వివరాలు సేకరించాలని చెప్పారు. ఆయన వెంట వైద్యాధికారి సింధూజ, సూపర్‌వైజర్ భూషణ్, సిబ్బంది ఉన్నారు.

నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు



అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న శరవాణన్

రాయికల్(జగిత్యాల): అటవీ పరిరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శరవాణన్ హెచ్చరించారు. శనివారం చింతలూరు గ్రామంలోని అటవీ క్షేత్రాన్ని పరిశీలించారు. క్యాంప పథకం కింద అటవీశాఖలో చేపట్టిన పనులపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ, వన్యప్రాణుల సంరక్షణ కోసం చర్యలు చేపట్టాలని సూచించారు. అటవీ పరిరక్షణ కోసం ఎప్పటికప్పుడు నిఘా పెంచాలని అన్నారు. గ్రామాల్లో కలప లభిస్తే సంబంధిత అధికారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు, బీట్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ మండలాధ్యక్షుడు



ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుతో వేల్పుల రాజు

మంథని: మండల బీజేపీ అధ్యక్షుడు వేల్పుల రాజు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఏఐసీసీ కార్యదర్శి, మంథని శ్రీధర్‌బాబు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాశ్ రెడ్డి, నాయకులు లైౖశెట్టి రాజు, మంథని రాజేశ్, అనిల్ ఉన్నారు.

రాజ్యసభ ఎంపీని కలిసిన మాజీ ఎమ్మెల్యే



ఎంపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

సుల్తానాబాద్: రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్రను శనివారం హైదరాబాద్ ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో మున్నూరుకాపు కులస్తులు ఐక్యంగా ఉండి ముందుకు వెళ్లాలని సూచించారు.కార్యక్రమంలో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి బాలకిషన్ రావు మున్నూరు కాపు యూత్ రాష్ట్ర కన్వీనర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ నాయకులు ఉన్నారు.

కొలనూర్ ఫొటోగ్రాఫర్‌కు గోల్డ్‌మెడల్

ఓదెల: మండలంలోని కొలనూర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ ఉప్పు ముత్యం ఈనెల 5, 6 తేదీల్లో పాపికొండలులో జరిగిన జాతీయ స్థాయి వర్క్‌షాప్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించారు. వివిధ ప్రాంతాల నుంచి 50 మంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఫ్యాషన్ అండ్ గ్లామర్ విభాగంలో పతకం సాధించారు. సిగ్మా అకాడమీ అధినేత ఎంసీ శేఖర్, బాబుల్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.

అభివృద్ధి పనుల కోసం స్థలం పరిశీలన

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియాలోని 12వ డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు శనివారం అధికారులు స్థలాన్ని పరిశీలించారు. హైవింక్లయిన్ ప్రాంతంలో ఆర్వోప్లాంట్ నిర్మాణం, బస్టాండ్, సీనియర్ సిటిజన్ హాల్ నిర్మాణం, ప్లాంటేషన్ కోసం స్థలాన్ని అన్వేషించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొడ్డు రజితరవీందర్, అధికారులు అంజనేయప్రసాద్, డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, ఫారెస్ట్ అధికారి అభిలాష్, డీవైఎస్‌ఈ వసంత కుమార్ పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి స్థలమివ్వాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న సమరయోధులు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రం పెద్దపల్లిలో స్వాతంత్య్ర సమరయోధుల సంఘ. కార్యాలయ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, కలెక్టర్ సంగీతను కోరారు. ఈ మేరకు శనివారం సమరయోధుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు తానిపర్తి కాంతారావు, ఎరబెల్లి రంగారావు, వారసుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని వెంకటేశం, కోల వెంకటేశ్వర్‌రావు, సాదుల ఉదయ్‌కుమార్ తదితరులు ఎమ్మెల్యేకు, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు. బస్టాండ్ సమీపంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సమరయోధుల సంఘ కార్యాలయం ఏర్పాటు కోసం స్థలాన్ని కేటాయించాలని కోరారు.

ఎమ్మెల్యే సిఫార్సు లేకుండా దళితబంధు అందించాలి

గోదావరిఖని: తన పోరాటం వల్లే స్థానిక ఎమ్మెల్యే జోక్యం లేకుండా దళితబంధు నేరుగా లబ్ధిదారులకు అందించాలని హైకోర్టు తీర్పు నిచ్చిందని సామాజిక సేవా నాయకులు మద్దెల దినేశ్ తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ ఆఫీస్ ఎదుట అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దళితబంధు మొదటి విడతలో నియోజకవర్గంలో ఎమ్మెల్యే తన అనుచరులకే ఇప్పించుకున్నారన్నారు. రెండో విడత కూడా ఒక యూనిట్‌కి రూ.4లక్షలు ఇస్తే ఇస్తే దళితబంధు ఇప్పిస్తామని కొంతమంది అధికారపార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.

ముత్తారం: పాశ్చాత్య పోకడలతో పాప్ సంగీతంలో ఓలలాడుతున్న నేటి సమాజంలో.. జానపదాలతో జనాల్లో చైతన్యం కలిగిస్తూ.. పదాలను పద్యాలుగా పాటలుగా మార్చి వారి గొంతుకగా నిలుస్తున్నారు ఆ పల్లె వాసులు... ఐదు దశాబ్దాలుగా పాటలే ప్రాణంగా మార్చుకుని ఎంతో మంది కళాకారులను తయారు చేసిన కళాకారుడు గోస్కుల కొమురయ్య కడుపులో పుట్టి పాటనే వారసత్వంగా స్వీకరించి, తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ తనతో పాటు నూతన కళాకారులను తయారు చేస్తున్నాడు.

సండే స్పెషల్



అడవి టు అమెరికా

- అగ్రరాజ్యంలో వినిపించనున్న గోస్కుల 'యక్షగానం
- తండ్రి బాటలో తనయుడు
- యక్షగానానికి కేరాఫ్ అడవిశ్రీరాంపూర్

ఖాతా నంబర్ : 62315393673
బ్యాంకు :ఎస్‌బీఐ ముత్తారం
బ్యాంక్ కోడ్: 0020528
ఫోన్ నంబర్ : 8184867373

కుటుంబ నేపథ్యం..

ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన గోస్కుల కొమురయ్య తన చిన్నతనంలో యక్షగానంపై పట్టు సాధించాడు. విప్లవ భావాలకు ఆకర్షితుడై సీపీఐ పార్టీ అనుబంధంగా ఉన్న పాటల బృందంలో చేరాడు. కొమురయ్య ప్రతిభను గుర్తించిన సినీ నటుడు ఆర్ నారాయణమూర్తి ఓ సినిమాలో పాట పాడే అవకాశాన్ని కల్పించారు. దీంతో కొమురయ్య పాట రాష్ట్ర స్థాయిలో మారుమోగింది. కూలన్న, ఎర్రసైన్యం సినిమాలో పలు పాటలకు ట్యూన్ అందించాడు. మోహన్‌బాబు నటించిన శ్రీరాములయ్య సినిమాలో బుర్రకథను వినిపించి అందరి మన్ననలు పొందారు. అనంతరం జన్మభూమి కార్యక్రమంలో ప్రజలను చైతన్య పరిచే పాటలు పాడారు. కొమురయ్య గానం 2021లో మూగబోయింది. ఎంతో ప్రతిభ ఉన్న ఈ గాయకుడిని తెలంగాణ ప్రభుత్వం మరిచిపోయింది.

తండ్రి వారసత్వాన్ని పునికిపుచ్చుకుని..

తన తండ్రి వారసత్వాన్ని పునికిపుచ్చుకున్న కొమురయ్య కుమారుడు రమేశ్ చిన్నప్పటి నుంచే తండ్రి వెంట అన్ని కార్యక్రమాల్లో పాలుపంచుకున్నాడు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1993లో 'బందులు.. బంధులు.. హత్యలు కిడ్నాపులు' అనే పాట పాడి అమాయక ప్రజల ఇబ్బందులను ఎత్తి చూపాడు. జిల్లా, రాష్ట్రస్థాయిలో పలు పురస్కారాలు పొందాడు.

ఊరంతా కళాకారులే..

గోస్కుల కొంరయ్య స్థాపించిన సాయి మారుతి కళామండలి బృందం ఆధ్వర్యంలో ప్రతిభ ఉన్న వారందరికీ అవకాశాలను కల్పించారు. వీరిలో దేశిని రామస్వామి అనే అంధుడు 30 ఏళ్లకు పైగా తబలా వాయిస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు.

తానా సభలకు ఆహ్వానం

మారుమూల పల్లెలో మొదలైన గోస్కుల గానం త్వరలోనే అమెరికా దేశానికి వెళ్లనుంది. ఈ బృందం ఇటీవల హైదరాబాద్ రవీంద్రభారతిలో తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యక్షగాన ప్రదర్శన ఇచ్చింది. దీనిని చూసి నిర్వాహకులు అమెరికాలో జూన్‌లో జరిగే కార్యక్రమానికి రావాల్సిందిగా రమేశ్ బృందాన్ని ఆహ్వానించారు. కానీ వారికి ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తాయి. అమెరికా వెళ్లేందుకు చేతిలో చిల్లి గవ్వ కూడా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాపోషకులు, దాతలు ముందుకు వచ్చి తమకు సాయం చేయాలని వేడుకుంటున్నారు.



హనుమాన్ వేషధారణలో కొమురయ్య



ఆర్. నారాయణ మూర్తితో..

తండ్రి ఆశయాలను కొనసాగిస్తా..



గ్రామాల్లో యక్షగానం, రామాయణం,వర్లైటూరి నేపథ్యంతో కూడిన పాటలు, నాటకాలు కనుమరుగుతున్న సమయంలో వాటిని కాపాడేందుకు నిరంతరం ప్రయత్నిస్తాం. మా నాన్న గారు కొంరయ్య చూపిన బాటలోనే వెళుతూ పల్లె గొంతులకు మరింత మెరుగులు దిద్దుతా. కళాకారుడిగా పుట్టడమే నా అదృష్టం. నాన్న ఆశయ సాధన కోసం కృషి చేస్తా.

– గోస్కుల రమేశ్, కళాకారుడు

గజ్జె కడితే ఆ సంతోషమే వేరు..



కాలుకు గజ్జె కడితే ఆ సంతోషమే వేరు. గత 30 ఏళ్లుగా విప్లవ పాటలతో పాటు తెలంగాణ ఉద్యమంలో ఎక్కడ సభ ఉంటే అక్కడకు కడుపు కట్టుకుని సైతం రాత్రి పగలు తేడా లేకుండా వెళ్లేవాడిని. ఓ కార్యక్రమంలో కింద పడి నా వెన్నుపూసకు గాయమైనా ఆగకుండా మళ్లీ గజ్జె కట్టడం మొదలుపెట్టా. పోరు తెలంగాణ సినిమాలో ఓ పాత్రలో నటించాను.

– దుబాసి శ్రీనివాస్, కళాకారుడు అడవిశ్రీరాంపూర్

కొమురయ్యే మాకు ఆదర్శం



నా చిన్న వయస్సులో కొమురయ్య పాడే పాటను చూసి ఆకర్షితులయ్యా. రాత్రంతా నిద్రను సైతం లెక్కను చేయకుండా కొమురయ్య పాడే పాటను వింటూ ఉండేవాళ్లం. కొన్ని రోజుల తరువాత మాకు నేర్పించమని అడగగానే మాకు యక్షగానం, రామాయణం లాంటి పలు నాటకాలు నేర్పించారు.

– కూనారి సత్యనారాయణ, కళాకారుడు

ఓబీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

యైటింక్లయిన్‌కాలనీ: ఓసీపీ–5లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ముస్త్యాల సర్పంచ్ రామగిరి లావణ్య అన్నారు. శనివారం సంఘం అధ్యక్షుడు కౌశిక హరి ఆదేశాల మేరకు పీసీ పటేల్ ఓసీపీ–5 ప్రాజెక్ట్ ఆర్జీ–1 ఓబీ కాంట్రాక్టర్‌కు కార్మికులతో కలసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని, 8 గంటల పనివిధానాన్ని అమలు చేయాలని కోరారు. అదనంగా పని చేస్తే వారికి ఓటీ కింద డబుల్ మస్టర్ చెల్లించాలని పేర్కొన్నారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓబీ కాంట్రాక్ట్ కార్మికులు శ్రీనివాస్, రాజు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బొట్లవనపర్తి సర్పంచ్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

ధర్మారం: మండలంలోని బొట్లవనపర్తి సర్పంచ్ రెడపాక ప్రమీల అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన వార్డు సభ్యులు, గ్రామస్తులు శనివారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రమీల భర్త అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ పాలకవర్గ నిర్ణయాలకు వ్యతిరేకంగా తన నిర్ణయాలను అమలు చేస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనులకు తీర్మానాలు ఇవ్వడానికి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బత్తిని సంతోష్, తిరుపతమ్మ, మదసూదన్, బుచ్చమ్మ, తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై సర్పంచ్ ప్రమీలను వివరణ కోరగా తాము ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, తానంటే గిట్టని వారు తప్పుడు ఫిర్యాదు చేయించారని తెలిపారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన ఎంపీపీ, జెడ్పీటీసీ

ధర్మారం: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి సానుగోటి నవీన్‌రావును ధర్మారం ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, జెడ్పీటీసీ పుస్కూరి పద్మజ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని మేదారంలో నూతనంగా నిర్మిస్తున్న 30 పడకల ఆస్పత్రికి నవీన్‌రావు తండ్రి స్వర్గీయ మురళీధర్‌రావు జ్ఞాపకార్థం 6 ఎకరాల భూమిని దానం చేయటంతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల భూమిని దానం చేశారు. అదే విధంగా మేదారం నూతనంగా న్యాయస్థానం ఏర్పాటుకు కృషి చేసినందుకు నవీన్ రావు, సోదరుడు నర్సింగరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు ఇంగ్లిష్ సామర్థ్య పరీక్షలు



విజేతలకు జ్ఞాపిక అందిస్తున్న ఎంఈవో లక్ష్మి

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఈఎల్‌టీఏ) ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇంగ్లిష్ సబ్జెక్ట్‌పై మండల స్థాయి సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. స్పెల్‌వర్డ్స్, స్టోరీ టెల్లింగ్ అంశాలపై నిర్వహించిన పరీక్షలో మండల పరిధిలోని నాలుగు హైస్కూల్స్ నుంచి ఇరవైమంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈవో దాసరి లక్ష్మి ప్రశంసాపత్రం, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం.ఇరుగురాల ఓదెలు, ఎల్టా కన్వీనర్ శ్రీహరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: భాషా నైపుణ్యం విద్యార్థి వికాసానికి నిచ్చెన లాంటిదని ఎంఈవో ఆరెపల్లి రాజయ్య అన్నారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఈఎల్‌టీఏ), రాష్ట్ర విద్యా పరిశోధన మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) రాష్ట్రశాఖ పిలుపు మేరకు కాల్వశ్రీరాంపూర్ జెడ్పీ హైస్కూల్లో శనివారం విద్యార్థులకు మండల స్థాయి స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎంఈవో ఆరెపల్లి రాజయ్య ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలిగేడు: మండలంకేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నతపాఠశాలలో మండలస్థాయి ఈఎల్‌టీఏ(ఆంగ్ల భాష ఉపాధ్యాయ అసోసియేషన్) ఆధ్వర్యంలో మండలంలోని ధూళికట్ట, సుల్తాన్‌పూర్ ఎలిగేడు ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మండలస్థాయి ఆంగ్ల పదాలు స్పెల్‌విజార్డ్ ,స్టోరీ టెల్లింగ్ పోటీలను శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్లెక్స్ హెచ్‌ఎం జి. జీవన్‌రెడ్డి ఈఎల్‌టీఏ కన్వీనర్ ఎస్. రవీందర్‌రావు కోకన్వీనర్ ప్రేమలత, రామానుజం మక్సూద్ పాల్గొన్నారు.

రామగిరి:మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని 8,9 తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో ఇంగ్లిష్ ప్రావీణ్యత పోటీలు నిర్వహించారు. ఇంగ్లిష్ భాషలో స్పెల్లింగ్, స్టోరీ టెల్లింగ్ అంశాలలో పోటీలను నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎంఈవో బహుమతులు అందించారు. వీరు ఈనెల 22న పెద్దపల్లిలో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

దేశంలోనే నంబర్‌వన్ కల్యాణలక్ష్మి



లబ్ధిదారులకు చెక్కులు అందించిన ఎమ్మెల్యే

ఓదెల: కల్యాణలక్ష్మి దేశంలోనే నెంబర్‌వన్ అని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం ఓదెల మండలపరిషత్ కార్యాలయంలో 58 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కల్యాణలక్ష్మితో సీఎం ఆడబిడ్డలకు అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కునారపు రేణుకదేవి, పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ కె రమేశ్, ఎంపీడీవో జి సత్తయ్య, వెంకటరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేడు పీహెచ్‌సీ పక్కాభవనానికి శంకుస్థాపన

మండలంలోని కొలనూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పక్కాభవనానికి నేడు ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి



మాట్లాడుతున్న కృష్ణ

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి సంస్థను ప్రైవేటీకరణ చేసే కేంద్రంపై, ఔట్ సోర్సింగ్ పేరుతో ప్రైవేటీకరించే రాష్ట్రం ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని తెలంగాణ గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.కృష్ణ పిలుపునిచ్చారు. శనివారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశ సంపద, సహజవనరులను వివిధ పేర్లు పెట్టి విక్రయిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను బడా పెట్టుబడిదారులకు అప్పజెప్పడాన్ని తక్షణమే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 8న గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సులో కోదండరాం, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు ఎస్.వెంకటేశ్వర రావు, విమలక్క, కె.బోను, ముకుందరావు, పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. సింగరేణిలోని అన్ని విభాగాల బొగ్గు గని కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్, నరేష్, తిరుపతి, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల బాధ్యతలు స్వీకరణ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి తహసీల్దార్‌గా శనివారం ఆర్. వెంకటలక్ష్మి పదవీబాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ధర్మారం తహసీల్దార్‌గా పనిచేసిన వెంకటలక్ష్మి పెద్దపల్లికు బదిలీపై రాగా, ఇక్కడ పనిచేసిన సుధాకర్ పెద్దపల్లి ఆర్డీవో కార్యాలయ ఏవోగా బదిలీ అయ్యారు.

ధర్మారం: మండల తహసీల్దార్‌గా శ్రీనివాస్ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేసిన వెంకటలక్ష్మి పెద్దపల్లి తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లగా పెద్దపల్లి కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ తహసీల్దార్‌గా వచ్చారు. వెంకటలక్ష్మి నుంచి బాధ్యతలు తీసుకున్నారు.

పాలకుర్తి: మండల తహసీల్దార్‌గా జె.సునీత శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు పనిచేసిన వరందన్ ముత్తారం బదిలీ కాగా, కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సునీత పాలకుర్తికి బదిలీపై వచ్చారు.

జూలపల్లి: మండల తహసీల్దార్‌గా బి.జయశ్రీ శనివారం బాధ్యతలు చేపట్టారు.పెద్దపల్లి కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించి, బదిలీపై జూలపల్లి తహసీల్దార్‌గా వచ్చారు. ఈ సందర్భంగా నాయబ్ తహసీల్దార్ అబూబాకర్, సిబ్బంది స్వాగతం పలికారు.

కాంట్రాక్టీకరణ పేరుతో ప్రభుత్వాల దోపిడీ

- ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య

రామగిరి: సింగరేణిలో కాంట్రాక్టీకరణ, ప్రైవేటీకరణ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోపిడీకి పాల్పడుతున్నాయని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య ఆరోపించారు. ఏపీఏ ఏరియా పరిధి అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్(ఏఎల్పీ)లో శనివారం నిర్వహించిన గేట్ మీటింగ్ పాల్గొని మాట్లాడారు. కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అలుపెరుగని పోరాటాలు చేస్తున్నట్లు వివరించారు. రానున్న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో కార్మికులు ఏఐటీయూసీకి అండగా నిలవాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ వైవీ రావు, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ సమ్మయ్య, సెక్రటరీ గంగాధర్, అడ్వైజర్ కిరణ్, బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ నర్సింగరావు, నాయకులు మెరుగు రాజయ్య, రమణయ్య, మొండయ్య, మోహన్‌రావు, కార్మికులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



యూనిట్ ప్రారంభిస్తున్న డీఆర్‌డీవో

పెద్దపల్లిరూరల్: మహిళలు ఆర్థికాభ్యున్నతి సాధించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్ అన్నారు. పెద్దపల్లి మండలం పెద్దకల్వలలో శనివారం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, ఎస్‌బీఐ సహకారంతో చిత్రన్, జయజ్యోతికి మంజూరైన పిండివంటల ప్యాకింగ్ యంత్రాన్ని శనివారం డీఆర్‌డీవో శ్రీధర్, సర్పంచ్ కావెంగుల రమేశ్ ప్రారంభించారు. మహిళా సంఘాల సభ్యులకు వడ్డీరాయితీతో అందిస్తున్న రుణాలను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ సునీత, లీడ్‌బ్యాంకు మేనేజర్ వెంకటేశ్, డీపీఎం రవి, ఏపీఎంలు దివ్య, పోచం, సీసీ రాజ్‌కుమార్, వీవోఏలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అవినీతి పాలన సాగుతోంది



మాట్లాడుతున్న ఆరుముళ్ల పోచం

జ్యోతినగర్: రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో అవినీతి రాజ్యమేలుతుందని బీజేపీ రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ ప్రభారి ఆరుముళ్ల పోచం అన్నారు. శనివారం ఎన్టీపీసీ రామగుండం లక్ష్మీనరసింహ గార్డెన్స్‌లో కార్పొరేషన్ అధ్యక్షుడు గుండబోయిన లక్ష్మణ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన బూత్ లెవల్ మహా సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. రాబోయే రోజుల్లో ఎన్నికలు రానున్నాయని, బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాడని అప్పగిస్తే అవినీతే ధ్యేయంగా రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బల్మూరి వనిత, అమరేందర్‌రావు, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య, అరుణ్ కుమార్, దళిత మోర్చా రాష్ట్ర కోశాధికారి శివాజీ, రైల్వే బోర్డు మెంబర్ క్యాతం వెంకటరమణ, నాయకులు బూత్ లెవల్ కన్వీనర్లు పాల్గొన్నారు.

గెలుపులో బూత్ కమిటీ సభ్యులది కీలకపాత్ర

మంథని: పార్టీ గెలుపులో బూత్ కమిటీ సభ్యులు కీలక పాత్ర పోషించాలని బీజేపీ మంథని అసెంబ్లీ ప్రభారి కాటంగూరి అనిల్‌రెడ్డి అన్నారు. శనివారం పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వర్చువల్‌గా నిర్వహించిన నియోజకవర్గాల సమ్మేళనంలో పార్టీ రాష్ట్ర నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయాలని, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

సంక్షిప్త వార్తలు

31 లోపు దరఖాస్తు చేసుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ: తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ రామగుండం పాఠశాల,కళాశాలలో అడ్మిషన్ కోసం మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సీఐవో కార్యదర్శి అతియాఫు గిఫ్రా, కౌన్సిలర్లు అహ్మద్ పాషా, అయేషాసిద్దిఖా, ముహ్మద్ ఇస్మాయిల్, మొహ్సిన్ షరీఫ్ అన్నారు. ఈనెల 31తో గడువు ముగుస్తుందన్నారు.విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి పాటల పోటీలకు ఎంపిక

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల పాటల పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ కటకం అంజయ్య తెలిపారు. జిల్లా స్థాయి యువజనోత్సవాల పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచి, 10 మంది విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 9,10 తేదీలలో హైదరాబాద్‌లోని శిల్పారామంలో పాటల పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

కాలనీవాసులకు పట్టాలివ్వించాలి

గోదావరిఖని: మందకొమరమ్మ కాలనీ వాసులకు పట్టాలిప్పించాలని కోరుతూ హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్‌ను కోరారు. శనివారం హెచ్‌ఎంఎస్ కేంద్ర కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రియాజ్‌అహ్మద్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు రాధా, అరుణ, సరోజన, అంజలి, అర్చన, నర్సమ్మ, సారమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలి

పెద్దపల్లిరూరల్: ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులను కల్పించాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్యాం డిమాండ్ చేశారు. మల్క రాంకిషన్‌రావు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం శనివారం జరిగింది. అనంతరం కలెక్టరేట్ ప్రధానద్వారం వద్ద క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. జీవో317లో అప్పీళ్లను పరిష్కరించి వెంటనే బదిలీ, పదోన్నతులు కల్పించాలన్నారు. సంతోష్‌రెడ్డి, కిరణ్‌కుమార్, కొమురయ్య తదితరులున్నారు.

కమాన్‌పూర్: ఉపాధ్యాయుల బదిలీలను, పదోన్నతులను వెంటనే చేపట్టాలని డీటీఎఫ్ జిల్లా నాయకులు మల్లేశ్వర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో డీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ నాయకులు రవీందర్, దశరథంతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.